క్లుప్తంగా

మొదలైన శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం శ్రీమద్భగవద్గీత అష్టాదశ అధ్యాయంలోని మోక్ష సన్న్యాసయోగంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. తొలుత ఆలయ పాలకమండలి సభ్యుల జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. మోక్షసన్న్యాసయోగంలో సన్న్యాస తత్త్వం, త్యాగ తత్త్వంపై చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి తెలియజేశారు.

సుప్రీంకోర్టు సీజేపై దాడి అనాగరిక చర్య



వెంకటరెడ్డి

గుంటూరు లీగల్: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి అనాగరిక చర్యను అని గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి పేర్కొన్నారు. సోమవారం న్యాయవాదుల అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో న్యాయవాదుల అభిప్రాయం మేరకు సంబంధిత ఉన్నత అధికారులకు వినతి పత్రాలు అందజేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.

సుప్రీంకోర్టు సీజేపై దాడి యత్నం హేయం

లక్ష్మీపురం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయిపై దాడికి ప్రయత్నించడం హేయమైన చర్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో మతోన్మాదులు అన్ని వ్యవస్థలను ఇప్పటి వరకు ధ్వంసం చేస్తూ వచ్చారని, ఇప్పుడు బహిరంగంగా సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పైనే చెప్పు విసరటాన్ని రాజ్యాంగానికి దేశ ప్రజలకు అవమానమని చెప్పారు. ఈ ఘటనపై ప్రధాని జవాబు చెప్పాలని కోరారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కులాల పేరుతో మతాల పేరుతో కొంత మంది లౌకికవాదులను టార్గెట్ చేసి దాడులు చేయటాన్ని ప్రజాతంత్ర వాదులు, అభ్యుదయవాదులు, లౌకిక శక్తులందరూ ఖండించాలని పిలుపు నిచ్చారు.

నూతన జీఎస్టీ రేట్లపై అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో 'సూపర్ జీఎస్టీ అండ్ సూపర్ సేవింగ్స్ ఇన్ ఇండియా అండ్ ఆంధ్రప్రదేశ్' 8 అనే అంశంపై కళాశాల వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గుంటూరు సీజీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వి.మనోజ్‌కుమార్ మాట్లాడుతూ గత నెల 22 నుంచి దేశ వ్యాప్తంగా అమల్లోకి వచ్చిన జీఎస్టీ సంస్కరణల గురించి వివరించారు. గతంలో నాలుగు దశల్లో ఉన్న జీఎస్టీ రేట్లు ప్రస్తుతం ఐదు శాతం, 18 శాతం, 40 శాతంగా ఉన్నాయని వివరించారు. ఈసందర్భంగా జీఎస్టీలో ప్రవేశపెట్టిన సంస్కరణలు వివిధ రంగాలపై ప్రభావం వంటి అంశాలను వివరించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, సీజీఎస్టీ కార్యాలయ సూపరింటెండెంట్లు టీవీజీకే మూర్తి, టి.పూర్ణచంద్రరావు, అనూప్‌కుమార్ పాల్గొన్నారు.

శివ శివా.. ఇదేమి స్వామీ!

శివాలయం లడ్డు పోటుకు మురుగు దెబ్బ




పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకాని శివాలయంలో లడ్డు తయారీ చేసే షెడ్డు పక్కనే నిల్వ ఉన్న మురుగునీరు దుర్గంధం వెదజల్లుతోంది. పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానం అన్ని విధాలా అభివృద్ధి చెందుతున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా లడ్డు పోటు షెడ్డు గేటుకు ఇరువైపులా మురుగునీరు నిల్వలు, పశువుల వ్యర్థాలు వెక్కిరిస్తున్నాయి. లడ్డు తయారీకి ఏర్పాటు చేసిన పిండి మర వద్దకు మురుగునీటి తేమ వస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లడ్డు తయారీ అక్కడ నుంచి మరొక ప్రదేశానికి మార్చడం గానీ, ఆ ప్రదేశంలో ఉన్న మురుగునీరు పారుదల అయ్యేలా చర్యలు తీసుకోవడం, పశువుల వ్యర్థాలు తొలగించడం వంటి చర్యలు చేపట్టాలని భక్తులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవం

పెదకాకాని: కనకదుర్గ అమ్మవారి గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పెదకాకాని మండలంలోని నంబూరు శ్రీనాగారపమ్మ ఆలయ ప్రాంగణంలో దసరా పండుగ పురస్కరించుకుని కనకదుర్గ అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన శనగల బలరామిరెడ్డి యూత్ ఆధ్వర్యంలో 11 రోజుల పాటు ప్రతి రోజూ ఒక రూపంలో అమ్మవారిని అలంకరించి పూజలు జరిపించారు. కనకదుర్గ అమ్మవారిని ఆదివారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని స్వాగతించి కొబ్బరికాయలు, పసుపు,కుంకుమలు సమర్పించారు. తీన్‌మార్ తప్పెట్లు, సాంస్కృతిక కార్యక్రమాలతో కళాకారులు సందడి చేశారు. రాత్రి గ్రామ శివారులోని కాలువలో అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేశారు.

స్వచ్ఛ అవార్డులు పారిశుద్ధ్య కార్మికులకు అంకితం

కార్పొరేషన్ మేయర్ రవీంద్ర



సీఎం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నగర మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూ నగర్: రాష్ట్ర స్థాయి స్వచ్ఛ ఆంధ్ర అవార్డు- 2025 స్పెషల్ కేటగిరిలో గుంటూరు నగరపాలక సంస్థ అవార్డు అందుకోవడం గర్వకారణంగా ఉందని, ప్రజారోగ్య కార్మికులకు అంకితమని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో దేశంలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాష్ట్ర స్థాయి స్వచ్ఛ అవార్డ్ 2025 కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా మేయర్, కమిషనర్లు అవార్డ్ అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం, రాష్ట్రం ఎక్కడైనా స్వచ్ఛ అవార్డు అంటే తప్పనిసరిగా గుంటూరు నగరపాలక సంస్థ నిలిచేలా గత ఏడాది కాలంగా ప్రజారోగ్య రంగాన్ని తీర్చిదిద్దామన్నారు. ప్రధానంగా ప్రజారోగ్య విభాగ పటిష్టకు అదనపు కార్మికులు, వాహనాలు అందుబాటులో ఉంచడం, డ్రెయిన్ల ఆక్రమణల తొలగింపు, స్థానిక ప్రజా ప్రతినిధులైన కార్పొరేటర్లను భాగస్వాములను చేయడం, వార్డ్ లలో మెరుగైన పర్యవేక్షణకు ఎలక్షన్ వార్డ్ కి ఒక ఇన్‌స్పెక్టర్‌ని కేటాయించడం ద్వారా పారిశుద్ధ్య విభాగంలో పెను మార్పులు సాధ్యమైనట్లు వివరించారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం ప్రజలు అందించే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ సోమవారం నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్



ప్రజలు నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

ద్వారా ప్రజల నుంచి 22 ఫిర్యాదులు తీసుకున్నారు. ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేర్వేరుగా లిస్టు తయారు చేయాలని కోరారు. డయల్ యువర్ కమిషనర్‌కు అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలని చెప్పారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. ప్రతి విభాగంలో పీజీఆర్ఎస్, గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలని వివరించారు. అర్జీల పరిష్కారంపై నగరపాలక సంస్థ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. క్షేత్ర స్థాయి అధికారులు అర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరి ష్కారానికి కృషి చేయాలన్నారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదు దారుడికి సమాచారం తెలియజేయాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 28 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 7, ఇంజినీరింగ్ విభాగానికి 8, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 7, పరిపాలన విభాగానికి 1 , అకౌంట్స్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ సుందర్‌రామిరెడ్డి, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

సినిమా థియేటర్లలో అధిక ధరలను అరికట్టాలి

సీపీఐ నగర కార్యదర్శి అరుణ్ కుమార్



జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

లక్ష్మీపురం: వినోదం మాటున జరుగుతున్న దోపిడీ దౌర్జన్యాలపై ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని, గుంటూరులోని సినిమా థియేటర్లలో క్యాంటీన్ ధరలు, టికెట్ రేట్లు అదుపు తప్పి సామాన్య ప్రజలపై భారమైపోయాయని సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో ఆయన గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ సినిమా థియేటర్ యాజమాన్యాలు ప్రేక్షకులను నిలువు దోపిడీ చేస్తున్నాయని, పాప్‌కార్న్, పఫ్, సమోసా, స్వీట్ కార్న్, కేక్స్, కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్ వంటి వస్తువులపై మార్కెట్ రేట్ల కంటే రెండింతలు, మూడింతలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి వసూలు చేయడం చట్ట విరుద్ధమని, దీనిపై అధికారులు వెంటనే దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గౌరీ శంకర్ థియేటర్‌లో ఆదివారం ఒక ప్రేక్షకుడిపై సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం, దాడికి ప్రయత్నించడం జరిగిందని బాధితులు సీపీఐ నాయకత్వం దృష్టికి తీసుకొచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు నూతలపాటి చిన్న, నగర కమిటీ సభ్యులు జంగాల చైతన్య, ధూపాటి వెంకటరత్నం పాల్గొన్నారు.

నకిలీ మందులను అడ్డుకోవాలి

లక్ష్మీపురం: కల్తీ మందుల కట్టడిలో ఉదాసీనంగా వ్యవహరిస్తే దేశ పురోగతి ప్రమాదంలో పడుతుందని, ఈ విషయాన్ని గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేస్తూ ఉత్పత్తి దశలోనే వాటిని అడ్డుకోవాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం ఆరోగ్య సభ నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ విచ్చలవిడిగా సాగుతున్న నకిలీ మందుల దందాలు ప్రజారోగ్యాన్ని బలి తీసుకుంటూనే ఉన్నాయన్నారు. సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.కృష్ణారావు మాట్లాడుతూ ఇండియాలో లభించే ఔషధాల్లో 25 శాతం నకిలీవేనని గతంలో ఒక అధ్యయనంలో తేలిందని, నిజానికి ప్రస్తుతం పట్టుబడుతున్న వాటితో పోలిస్తే నకిలీల బెడద ఇంకెన్నో రెట్లు అధికంగా ఉంటుందని హెచ్చరించారు. వ్యవస్థాగత లోపాలను సరిచేసి ఈ కల్తీ మందుల వ్యాపారాన్ని అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు నడుం బిగించాలన్నారు. సమావేశంలో అవగాహన సంస్థ సభ్యులు పి.భావన్నారాయణ, ఆర్.వెంకటరత్నం ప్రసంగించారు.

వెనుకబడిన కులాల హక్కుల సాధన రౌండ్ టేబుల్ నేడు



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు అజయ్‌కుమార్

లక్ష్మీపురం: రాష్ట్రంలో సుమారు 143 వెనుకబడిన కులాలు(బీసీలు) ఉన్నా, గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన స్థానాలు గణనీయంగా తగ్గించడంతో వేల సంఖ్యలో బీసీ ప్రతినిధులు నష్టపోయారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. గుంటూరు కొత్తపేటలోని జిల్లా సీపీఐ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వెనుకబడిన కులాల హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ఉద్దేశంతో గుంటూరు సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం కొత్తపేట మల్లయ్యలింగం భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు బీసీల హక్కుల గురించి మాట్లాడుతున్నా, మరోవైపు కులగణన చేపట్టడంలో ఆసక్తి చూపకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు పాల్గొన్నారు.

నవంబర్ 17న గుంటూరులో మహా రుద్రాభిషేకం



మహా రుద్రాభిషేకం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జూపూడి రంగరాజు, గాయత్రి బెహరా, నరేంద్రకుమార్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నవంబర్ 17న మహా రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు తెలిపారు. సోమవారం అమరావతి రోడ్డులోని కళాశాలలో రుద్రాభిషేకానికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా జూపూడి రంగరాజు మాట్లాడుతూ కార్తీక మాసంలో నిర్వహించనున్న మహా రుద్రాభిషేకంలో అఘోరా అఖాడ ఉత్తరాధికారి, ఉజ్జయినివాసి డాక్టర్ రాజేష్ నాథ్ అఘోరి పాల్గొని శివునికి అభిషేకాలు నిర్వహిస్తారని వివరించారు.

అభిషేకాల అనంతరం శివునికి అభిషేకించిన రుద్రాక్ష భక్తులకు ఉచితంగా ఇవ్వబడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనడానికి ఎంట్రీ పాసు తప్పనిసరని, ఎంట్రీ పాస్ ఉచితంగా అందజేస్తామని చెప్పారు. పాస్‌లు కావాల్సిన వారు బ్రాడీపేట 3/9లోని ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్మెంట్ సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని, ఇతర వివరాలకు ఆర్గనైజర్ గాయత్రి బెహరాను సెల్ నంబరు 9949148006లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు గాయత్రి బెహరా, వనమా నరేంద్ర కుమార్, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి ప్రత్తిపాటి మాధవ శర్మ, రాష్ట్ర నాయకులు చిరుమామిళ్ల గోపీకృష్ణ, బజరంగ్‌దళ్ అధ్యక్షుడు మోహేష్ శాస్త్రి, సాదు సాయి, రామరాజు త్రికోటేశ్వరరావు, శంకరమంచి నాగసాయి, రాజేష్, కార్తికేయ, సంతోషి, పాడుగు కృష్ణారావు, అనిల్ బెహరా పాల్గొన్నారు.

ఉద్యోగుల సూపర్ సిక్స్ డిమాండ్స్ అమలు చేయాలి

జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్ బాషా



గుంటూరు వెస్ట్: కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలకు సమానమైన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు కూడా సూపర్ సిక్స్ హక్కులను అమలు చేయాలని జిల్లా ఐక్యవేదిక చైర్మన్ సయ్యద్ చాంద్ బాషా డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమీపంలోని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 12వ వేతన సవరణ కమిటీని వెంటనే నియమించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు అందించాలని, 30 వేల కోట్ల పెండింగ్ బకాయిలపై స్పష్టత ఇవ్వాలని, ఉపాధ్యాయులకు, మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు యాప్‌ల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా ఐక్యవేదిక జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరిముల్లాషాఖాద్రి, నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, నగర శాఖ కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, తాలూకా యూనిట్ అధ్యక్షులు సుబ్బారావు పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం

నెహ్రూనగర్:గుంటూరు నగరంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. సుమారు 2 గంటలకు పైగా ఆగకుండా కురవడంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మూడువంతెనలు, కంకరగుంట ఆర్‌యూబీ, కొత్తపేట, నెహ్రూనగర్, రాజీవ్‌గాంధీనగర్, శ్రీనగర్, రైలుపేట, పాతగుంటూరు, విద్యానగర్, కొరిటెపాడు, బ్రాడీపేట, తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. కుండపోత వర్షంతో కార్యాలయం పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే నగర ప్రజలు వర్షంలో చిక్కుకున్నారు. రోడ్లన్నీ జలమయం కావడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై నిలిచిన వర్షం నీటిని మోటార్ల సహాయంతో ఎప్పటికప్పుడు తీయించాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. మూడు వంతెనలు, కంకరగుంట ఆర్‌యూబీ, రింగ్‌రోడ్డు, చుట్టుగుంట తదితర ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారుల సమన్వయంతో పనిచేయాలని, నగర ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగర ప్రజలు తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు ఎదుర్కొంటే నగర పాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, పార్టీ నేతలు

పట్నంబజారు: శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ కేంద్ర కార్యాలయంలో నేతలు, కార్యకర్తలు నడుమ ఈ వేడుకలను సోమవారం ఆయన జరుపుకొన్నారు. ఆయనతో వారందరూ కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో పార్టీ లీగల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, కోటేశ్వరరావు, సయ్యద్ బషీర్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కార్యాలయంలో..

శాసనమండలి సభ్యులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ ఎమ్మెల్సీ కార్యాలయంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్, స్ఫూర్తి ఫౌండేషన్స్‌ప్రధాన కార్యదర్శి బందా రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు గడ్డేటి సురేంద్ర ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుస్తులు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. షేక్ రబ్బానీ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు దువా నిర్వహించారు. అలాగే 23వ డివిజన్‌లో షేక్ ఫాజిల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి జన్మదిన కేక్‌ను కట్ చేయగా పార్టీ నేతలు హాజరైయ్యారు. తూర్పు నియోజకవర్గం 8వ డివిజన్‌లో క్రిస్టియన్ యూత్ రాణాప్రతాప్ ఆధ్వర్యంలో అప్పిరెడ్డి జన్మదిన వేడుకల కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాలుపురం రాము), రాష్ట్ర యువజన నేత నూనె ఉమామహేశ్వర రెడ్డి, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పార్టీ నేతలు షేక్ మస్తాన్‌వలి, గులాం రసూల్, బత్తుల దేవానంద్, డాక్టర్ పోలే ముత్యం, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఆధ్వర్యంలో..

ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి జన్మదిన వేడుకలు న్యాయవాదుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అరండల్ పేట 11వ లైన్‌లోని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, పార్టీ లీగల్ విభాగం రాష్ట్ర నాయకుడు పోలూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం నేతల ఆధ్వర్యంలో బృందావన గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ అప్పిరెడ్డి కార్యాలయంలో భారీ కేక్ కట్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ గులాం రసూల్ పాల్గొన్నారు.

'కళ్లం'లో పైథాన్ ప్రోగ్రామింగ్, డేటా ఎనాలసిస్‌పై వర్క్ షాప్



గుంటూరు రూరల్: కంప్యూటర్ సైన్స్‌లో ఇంజినీరింగ్ విద్యనభ్యసించే విద్యార్థులకు వర్క్ షాప్స్(కార్యశాల) ద్వారా విద్యార్థులలో నూతన విషయాలు నేరుగా తెలుసుకునే అవకాశాలు ఏర్పడతాయని కళ్లం హరినాథ్‌రెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (స్వయం ప్రతిపత్తి) డైరెక్టర్ డాక్టర్ ఉమాశంకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చౌడవరంలోని కళాశాలలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎక్సెల్ ఆర్ ఎడ్యుటెక్ సంస్థ సహకారంతో 'ఎక్స్‌ప్లోపరెటరీ డేటా ఎనాలసిస్ విత్ పైథాన్' అంశంపై 9 రోజుల వర్క్ షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎస్ఈ విభాగాధిపతి రాజీవ్ జట్సన్ మాట్లాడుతూ పైథాన్ ప్రోగ్రామింగ్ భాషపై పూర్తి ఆధిపత్యం చెలాయించడంతో పాటు డేటా సైన్స్ రంగంలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలను తీర్చగల స్థాయికి ఈ శిక్షణ దోహద పడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎక్సెల్ ఆర్ ఎడ్యుటెక్ ప్రతినిధి లక్ష్మణ్ అధ్యాపకులు డాక్టర్ ఏ శ్రీనివాసరావు, చుక్క సామ్సన్, కే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్

లక్ష్మీపురం: వృద్ధురాలి మెడలో నాలుగు సవర్ల బంగారు ఆభరణం చోరీ చేసిన వ్యక్తిని అరండల్‌పేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో సోమవారం డీఎస్పీ కె.అరవింద్ వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా రాజుపాలెం ప్రాంతానికి చెందిన భుక్యా భాగ్యమ్మ బాయి గుంటూరులోని శారదాకాలనీలోని మల్లికార్జునరావు పేట బంధువుల ఇంటికి ఈనెల 3వ తేదీన వెళ్తున్న సమయంలో వెనుక నుంచి సంజీవయ్యనగర్‌కు చెందిన పాలేపోగు ప్రశాంత్ వచ్చి ఆ వృద్ధురాలి మెడలోని 4 సవర్ల బంగారం ఆభరణాన్ని చోరీ చేసి పరారయ్యాడు. బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ ఆరోగ్య రాజు, ఎస్ఐ కృష్ణబాజీ ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విచారణ చేశారు. ఈ విచారణలో సోమవారం చైన్ స్నాచింగ్ చేసిన వ్యక్తి ప్రశాంత్ బ్రాడీపేటలో ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారించగా, వృద్ధురాలి మెడలోని 4 సవర్ల బంగారం ఆభరణం చోరీ చేసినట్లు అంగీకరించారు. ఆభరణాన్ని పోలీసులు స్వాధీనం చేసకుని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వివరించారు.

మరమ్మతులకు నోచుకోని ఆర్వో ప్లాంటు..



పొన్నూరు: అధికారుల నిర్లక్ష్యంతో ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. గత ప్రభుత్వం విద్యార్థులకు రక్షిత తాగునీరు అందించేందుకు పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేసింది. కొంతకాలానికి మరమ్మతులకు గురికావడంతో ఆర్వో ప్లాంటు మూలకు చేరింది. ఫలితంగా రక్షిత జలం అందడం లేదు. అప్పటి నుంచి హాస్టల్ వార్డెన్ సమస్యను ఉన్నతాధికారులకు చెబుతూనే ఉన్నారు. అయినా ప్లాంటుకు మరమ్మతులు చేయడం లేదు. అధికారులకు మరోసారి సమస్యను తెలియజేస్తామని వార్డెన్ వెంకటేశ్వరమ్మ అన్నారు.

పొదుపుపై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ పెట్టుబడిదారుల వారోత్సవాల్లో భాగంగా 'పెట్టుబడులు-పొదుపు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ పీజీ, డిగ్రీ కళాశాలలో సెక్యూరిటీస్, ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) ఆధ్వర్యంలో అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. సెబీ ప్రాంతీయ కార్యాలయ జనరల్ మేనేజర్ ఎంకే శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుండే పొదుపు, పెట్టుబడుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డబ్బును వృథాగా ఖర్చు పెట్టకుండా, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పొదుపు చేసే క్రమాన్ని అలవాటుగా మార్చుకోవాలని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా జరిగే ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పీజీ, డిగ్రీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.అనితాదేవి, డాక్టర్ బీవీహెచ్ కామేశ్వర శాస్త్రి, వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, జి సురేష్ కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటెపాడు: బీఆర్ స్టేడియం ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు-4 డీఈఈ పి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. బీఆర్ స్టేడియం, అంకమ్మతల్లి దేవాలయం, కమ్యూనిస్టు బొమ్మలు, సత్యనారాయణ స్వామి దేవాలయం, అలీనగర్, సూర్యనగర్, బాబోజీ, మఠం, ముగ్ధం నగర్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

గుంటూరు రూరల్: రెడ్డిపాలెంలోని వృద్ధాశ్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి జన్మదినం సందర్భంగా వైఎస్సార్ సీపీ విభాగం రాష్ట్ర కార్యదర్శి కాటూరి విజయ్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్, అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమంలో వృద్ధులతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో మధు ప్రేమజ్యోతిబాబు, కార్పొరేటర్ పాపతోటి అంబేద్కర్, దారా హేమ ప్రసాద్, పాటిబండ్ల కిరణ్, షేక్ మహబూబ్ పాల్గొన్నారు.

ఘనంగా సంప్రదాయ దుస్తుల పోటీలు

తెనాలి: స్థానిక గీతామందిరంలో శ్రీవెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవాబృందం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఆడపిల్లలకు సంప్రదాయ దుస్తుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఉప్పులూరి శారద, నారాయణ భారతిదేవి, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీలకు మొత్తం 50 మంది చిన్నారులు హాజరయ్యారు. వీరిలో వివిధ కేటగిరీల్లో 16 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, అయినాల మల్లేశ్వరరావు, కంకిపాడు రమేష్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. పి.జ్యోత్స, లక్ష్మీమాధవికి మొదటి బహుమతి రూ.1,000 చొప్పున, రెండో బహుమతిగా ఎ.వెన్నెల, కె.హన్సికరెడ్డికి రూ.500 వంతున, జె.దైవజ్ఞ, వి.కోమలశ్రీ, టి.పరమేశ్వరప్రియకు మూడో బహుమతిగా రూ.300 చొప్పున బహూకరించారు. మరో పదిమందికి రూ.100 చొప్పున ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. నేటితరం సంప్రదాయాన్ని మరవకూడదనే భావనతో ఈ పోటీలను నిర్వహించినట్టు సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు చెప్పారు. వీరంశెట్టి రజిని, తల్లం సావిత్రి, కర్నాట జయలక్ష్మి, కటకం అన్నపూర్ణ, నంబూరి వినతి, దేవానంద్, వేమూరి విజయభాస్కర్ పాల్గొన్నారు. కొండపి వసుంధర పర్యవేక్షించారు.